నిప్పు పెనుముప్పు



పరిగి: బస్టాండ్‌లో మాక్‌డ్రిల్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

- దుకాణ సముదాయాల్లో నిబంధనలు తప్పనిసరి
- ఫైర్ యాక్సిడెంట్లతో జాగ్రత్త
- అగ్నిమాపక వారోత్సవాల్లో సిబ్బంది

పరిగి: అగ్గితో ఆటలాడొద్దని, నిప్పు పెనుముప్పని అగ్నిమాపక సిబ్బంది చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పరిగి పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. ఇందులో భాగంగా ఫైర్ యాక్సిడెంట్‌పై మాక్‌డ్రిల్ ప్రదర్శించి.. అగ్నికీలలను ఎలా నిలువరించాలి, ముప్పు నుంచి ఎలా తప్పించుకోవాలో కళ్లకు కట్టారు. అనంతరం మాట్లాడుతూ షాపింగ్‌మాల్, సినిమాహాల్, మార్కెట్లు, దుకాణ సముదాయాల్లో అగ్నిమాపక నిబంధనలు పాటించాలని చెప్పారు. పరిగి ఆర్టీసీ డిపో డీఎం పవిత్ర మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ఎంతో సంతోషించదగిన విషయమని, ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు తప్పకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్: ఆర్టీసీ బస్టాండ్‌లో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అవగాహన

కొడంగల్: అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ కొడంగల్ ఇన్‌చార్జి, ఫైర్ అధికారి పవన్‌కుమార్ చెప్పారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, పరిసర ప్రాంతంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా గ్యాస్ సిలిండర్ వాడకంపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎల్‌పీజీ సిలిండర్ వాడకం, లీకేజీపై గృహిణులు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది మతీన్, శ్రీనివాస్, శ్యామప్ప, బొరానొద్దీన్, శాంతీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్ల బావికి పూర్వ వైభవం తేవాలి



బావిని పరిశీలిస్తున్న కమిషనర్, కౌన్సిలర్

కొడంగల్: పట్టణ శివారు గాడిబాయి ఆలయ సమీపంలోని అతి పురాతన కాలంనాటి మెట్ల బావికి మరమ్మతు చేసి, పూర్వ వైభవాన్ని తీసుకురావాలని మున్సిపల్ కౌన్సిలర్ మధుయాదవ్ కోరారు. శనివారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో కలిసి బావిని పరిశీలించి మాట్లాడారు. ఈ బావికి ఎంతో చరిత్ర ఉందని తెలిపారు. బావి లోపల మరో 9 బావులు ఉన్నాయని, అన్ని కాలాల్లోనూ నీటితో నిండుగా ఉంటుందని తెలిపారు. పురావస్తు శాఖ అధికారులు బావిని పరిశీలించి, చరిత్రను కాపాడాలని కోరారు.

17వరి కొనుగోలు కేంద్రాలు

కుల్కచర్ల: రైతుల నుంచి ధాన్యం సేకరించేందుకు కుల్కచర్లలో 9, చౌడాపూర్‌లో 8 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని మండల వ్యవసాయ అధికారి వీరస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 3 కేంద్రాలు, మహిళా సమాఖ్య 4, డీసీఎమ్మెస్ 01, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 9 కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద టోకెన్లు తీసుకొని, తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాలని సూచించారు. వరి ఏ గ్రేడ్‌కు రూ.2,060, బీ గ్రేడ్‌కు రూ.2,040 మద్దతు ధర అందించడం జరుగుతుందని వెల్లడించారు.

క్లుప్తంగా

నేడు పెద్దేముల్‌లో ఆత్మీయ సమ్మేళనం

పెద్దేముల్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమానికి ఎంపీ రంజిత్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ముఖ్య అతిథితులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో రావాలని పేర్కొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: కొడంగల్ మండల పరిధిలోని 15 గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో అర్ధ మండల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. మండల పరిధిలోని రుద్రారంలో కార్యక్రమం ఉంటుందని, సమ్మేళనానికి మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి రానున్నట్లు చెప్పారు. కావున గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పార్టీ నాయకులు కోరారు.

ఇఫ్తార్ సహాయం పెంచాలి

కొడంగల్ రూరల్: రంజాన్ మాసంలో ఇచ్చే ఇఫ్తార్ సహాయాన్ని పెంచాలని మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎం.గౌసన్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ.. ఏటా రంజాన్ ఇఫ్తార్ విందుకోసం ప్రభుత్వం అందజేసే సహాయం సరిపోవడం లేదని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా.. సాయం పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాటమయ్య జాతర నేడు

తాండూరు రూరల్: జినుగుర్తిలో గౌడ సంఘాల కుల దేవత కాటమయ్య జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం గ్రామంలో నిర్వహించే ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం

కుల్కచర్ల: కులమతాలకు అతీతంగా అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. శనివారం బూరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బుడగజంగం సంఘం నాయకులకు అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు రూ.10వేల విరాళం అందజేసి మాట్లాడారు. బుడగ జంగాల ఆధ్వర్యంలో బాబా సాహెబ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కృతజ్ఞత సభకు సెర్ప్ సిబ్బంది



సభకు వెళ్లిన మండల సెర్ప్ సిబ్బంది

కుల్కచర్ల: పే స్కేల్ అమలు చేయడం పట్ల రాష్ట్ర సెర్ప్ ఉద్యోగ సంఘం నిర్వహిస్తున్న కృతజ్ఞత సభకు కుల్కచర్ల మండల సెర్ప్ సిబ్బంది ఏపీఎం శోభ ఆధ్వర్యంలో పలువురు వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి పాటుపడే ఉద్యోగులను ప్రభుత్వం గుర్తించడం సంతోషంగా ఉందని చెప్పారు. తాము చేస్తున్న సేవలను దృష్టిలో ఉంచుకొని, తమ సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సీసీలు, మహిళా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం

మర్పల్లి: అనారోగ్యంతో వారం రోజుల క్రితం మృతిచెందిన పబ్బే విజయ్‌కుమార్(38) దశదిన కర్మకోసం ఎస్‌కేఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సనగారి కొండల్‌రెడ్డి పంపిన రూ.50వేలను బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సురేష్, మర్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామేశ్వర్ శనివారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేయగా.. విజయ్‌కుమార్ చిన్ననాటి మిత్రుడైన ఒకరు రూ.41వేలు అందజేశారు.

ముగిసిన భవానీమాత ఉత్సవం



బోనాలతో గిరిజన మహిళలు

ధారూరు: డీకేతండాలో శనివారం అమ్మా భవానీమాత, మరియమ్మకు బోనాల ఊరేగింపు, నైవేద్యం సమర్పణతో ఉత్సవం ముగిసింది. ముందుగా అమ్మవార్లకు అభిషేకం నిర్వహించి, హారతి, పూర్ణాహుతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. తర్వాత గిరిజన మహిళలు బోనంతో అమ్మవారి సన్నిధికి చేరుకొని ప్రదక్షిణలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నిత్యం ప్రజాక్షేత్రంలోనే..

డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి



చలివేంద్రం ప్రారంభించిన మనోహర్‌రెడ్డి తదితరులు

కుల్కచర్ల: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా.. నిత్యం ప్రజాక్షేత్రంలోనే ఉంటానని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి చెప్పారు. శనివారం చౌడాపూర్ మండలం కొత్తపల్లిలో బీఎంఆర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం అక్కడే చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతులకు, వ్యవసాయ అనుబంధ రంగాల అభ్యున్నతికి కృషిచేయడంతో పాటు.. రాజకీయాలకు అతీతంగా బీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ.. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, కొత్తపల్లి రఘు, శ్రీనివాస్, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత



ఖుదావాన్‌పూర్‌లో వృద్ధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

- తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం
- 'పల్లెబాట'లో ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శనివారం చిట్యాల, రాపోల్, తొండుపల్లి, నర్సయ్యగూడ, ఖుదావన్‌పూర్, కాళ్లాపూర్, జాఫర్‌పల్లిలో నిర్వహించిన పల్లెబాట కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించి పల్లెల స్థితిగతులు, ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఎన్ని నిధులు మంజూరయ్యాయో ప్రజలకు వివరించి మాట్లాడారు. తెలంగాణలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. దళితుల అభ్యున్నతికి దళితబంధు, రైతు సంక్షేమం కోసం రైతుబంధు, రైతుబీమా పథకాలను సీఎం కేసీఆర్ తీసుకువచ్చారని తెలిపారు. ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. వృద్ధులు, వికలాంగులకు పింఛన్ ఇలా.. ప్రతి ఇంటికి ఏదో రూపంలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, వైస్‌ఎంపీపీ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పార్టీ మండల అధ్యక్షుడు అంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, వెంకటయ్య, రవీకుమార్, రవీందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మా ఎమ్మెల్యేను ప్రశ్నిస్తారా?

ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పల్లెబాటలో రసాభాస జరిగింది. రాపోల్ రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో పలువురు గ్రామ సమస్యలపై ఎమ్మెల్యేను అడగగా.. ఎమ్మెల్యే వర్గీయులు వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ తోపులాట జరిగింది. ఎమ్మెల్యే వారించినా ఫలితం లేకుండా పోయింది. సమస్యలు ఎమ్మెల్యేకు విన్నవించుకుంటుంటే కార్యకర్తలు ఎందుకు అడ్డుకుంటున్నారని గ్రామస్తులు ప్రశ్నించారు. మా ఎమ్మెల్యేను ప్రశ్నిస్తారా? అని కార్యకర్తలు అనడం ఏంటని, మాకు కూడా ఎమ్మెల్యేనే కదా.. అని మండిపడ్డారు. సమస్యలు తెలుసుకోవడానికి వచ్చినప్పుడు.. వినాలి కానీ.. వాగ్వాదం చేయడం సరికాదని హితవుపలికారు. మహేశ్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఉపాధి కూలీలను పని మధ్యలో మాన్పించి.. హాజరు వేస్తామని చెప్పి పర్యటనకు తీసుకురావడం ఏంటని పలువురు ప్రశ్నించడంతో.. ఎమ్మెల్యే మధ్యలోనే వెళ్లిపోవడం గమనార్హం.



రాపోల్‌లో కార్యకర్తలు, గ్రామస్తుల మధ్య తోపులాట

వీధి నాటకాలను ప్రోత్సహించాలి



కళాకారులకు విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

దోమ: వీధి నాటకాలను ప్రోత్సహించాలని జెడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి బ్రహ్మణపల్లి పెద్దతండాలో ప్రదర్శించిన భక్త సిరియాల వీధి నాటకాన్ని ఆయన వీక్షించి మాట్లాడారు. గ్రామాల్లో వీధి నాటకాలను ప్రోత్సహించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం కళాకారులకు ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆదేశాను సారం రూ.15 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, ప్రచారకార్యదర్శి రాఘవేందర్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు మశ్చందర్‌రెడ్డి, సర్పంచులు మల్లేశ్, గ్రామస్తులు బీమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేత జట్లకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

పూడూరు: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని సర్పంచ్ బుచ్చన్న అన్నారు. శనివారం మండల పరిధిలోని దేవనోనిగుడలో క్రికెట్ విలేజ్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని, ఆటవిడుపుగా ఆటలు ఆడాలని సూచించారు. అనంతరం విజేతగా మొదటి స్థానంలో నిలిచిన రంగాపూర్ జట్టుకు రూ.30 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన తిర్మలాపూర్ టీంకు రూ.15 వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఇటీవల దళితరత్న అవార్డు అందుకున్న దేవనోనిగుడ వెంకటకయ్యను సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య, రాకంచర్ల ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహ, ఉప సర్పంచ్‌లు దశరథ్, రాజేందర్, నాయకులు వెంకటయ్య, గోపాల్, భాస్కర్, అశోక్, పాండు, యాదయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శులను పర్మినెంట్ చేయాలి



ఎంపీడీఓకు సమ్మె నోటీస్ ఇస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

పరిగి: తమ ప్రొబేషన్ పీరియడ్ పూర్తయినా.. రెగ్యులరైజ్ చేస్తున్నట్లుగా ప్రభుత్వం ఎలాంటి జీఓ విడుదల చేయలేదని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అన్నారు. ఈ మేరకు శనివారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీతో ప్రొబేషన్ పీరియడ్ పూర్తయిందని, వెంటనే ప్రభుత్వం తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తూ.. జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈనెల 28 నుంచి సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.

భక్తి శ్రద్ధలతో శబరి గిరీశుడి పడిపూజ

తాండూరు: తాండూరు పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం పడిపూజ కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, పడిపూజ, అనంతరం మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు.



అయ్యప్పస్వామి దేవాలయంలో పడిపూజ చేస్తున్న పూజారులు, భక్తులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మోమిన్‌పేట: మోమిన్‌పేట సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈఈ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. 33కేవీ విద్యుత్ తీగల కింద చెట్లు నరికి వేయడం, సబ్ స్టేషన్‌లో మరమ్మతు కారణంగా సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

బంట్వారంలో..

బంట్వారం: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాల్సి ఉన్నందున కోట్‌పల్లి మండలంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపి వేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సురేష్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం దుకాణాల బంద్ నేడు

తాండూరు టౌన్: శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి జాతర పురస్కరించుకుని తాండూరులో ఆదివారం మద్యం దుకాణాలు బంద్ చేయనున్నట్లు శనివారం ఎక్సైజ్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం, శాంతి భద్రతల దృష్ట్యా వైన్ షాపులు మూసి వేయనున్నట్లు తెలిపారు. బంద్ కేవలం తాండూరు పట్టణంలోని మద్యం షాపులకు మాత్రమే వర్తిస్తుందని ప్రకటించారు.

పూట గడవడం కష్టంగా ఉంది..



తాండూరు రూరల్: ఐకేపీ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న వీఓఏలు

తాండూరు రూరల్: చాలీచాలని జీతంతో పూటగడవడం కష్టంగా ఉందని వీఓఏలు ఆవేదన వ్యక్తంచేశారు. ఐకేపీ కార్యాలయం వద్ద వీఓఏలు చేస్తున్న సమ్మె శనివారంతో ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నెలకు రూ.3,900 వేతనంతో బతుకు బండిని ఎలా లాగాలని వాపోయారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెలకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించడంతో పాటు ఐడీ కార్డులు, డ్రెస్‌కోడ్ అమలుతో పాటు రూ.5 లక్షల బీమా వర్తింప జేయాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏల అధ్యక్షురాలు దీప, అశోక్, కోశాధికారి కృష్ణయ్య, వీఓఏలు పాల్గొన్నారు.

5వ రోజుకు చేరిన వీఓఏల సమ్మె



బంట్వారం: సమ్మెకు సంఘీబావం తెలుపుతున్న బసిరెడ్డి

బంట్వారం: సమస్యల సాధన కోసం వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి ఐదో రోజుకు చేరింది. ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు సమ్మె విరమించేది లేదని, తమ న్యాయమైన కోరికలను వెంటనే తీర్చాలని వీఓఏలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సహకార సంఘం మాజీ చైర్మన్ బసిరెడ్డి వీఓఏల సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నర్సింహులు, వీఓఏలు మశ్చందర్, ప్రవీణ్, వీరేశం, సునంద, లలిత, జయమ్మ, లాలయ్య, నరేందర్, రామకృష్ణ, రాజవర్ధన్‌రెడ్డి, మొల్లప్ప, మల్లేషం, మహేందర్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

ఎంపీ రంజిత్‌రెడ్డి చొరవతో పనులు షురూ

మోమిన్‌పేట: గడిచిన రెండేళ్లుగా సీసీరోడ్డు పనులు పూర్తిగాక నాలుగు గ్రామాల ప్రజలు రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎంపీ రంజిత్‌రెడ్డి చొరవతో నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది. సంబంధిత ఉన్నతాధికారులు, గుత్తేదారులతో మాట్లాడి పనులు వెంటనే ప్రారంభించేలా చొరవ చూపారు. రవాణాకు ఆటంకం కలగకుండా చూడాలని, అవసరమైతే రూ.50 లక్షలు అదనంగా ఇవ్వనున్నట్లు ఎంపీ చెప్పడంతో సీసీ, మురుగు కాలువ పనులు పునఃప్రారంభించారు.

రెండేళ్ల క్రితం..

మండల పరిధిలోని కోటపల్లి వెళ్లే రహదారిలో మొరంగపల్లి వద్ద రైల్వే గేటు అండర్ పాసు వంతెన నిర్మాణ పనులు రెండేళ్ల క్రితం చేపట్టారు. దీంతో కేసారం, సయ్యద్‌అల్లిపూర్, ఇజ్రాచిట్టంపల్లి, పల్లేగుట్టతండాతో పాటు మర్పల్లి మండలం తిమ్మాపూర్, రావులపల్లి, కోటపల్లి మండలం బార్వాద్ గ్రామాల ప్రజలు నిత్యం మోమిన్‌పేటకు వివిధ పనుల నిమిత్తం వచ్చి వెళ్తుంటారు. ఏడాది క్రితం రెండు నెలల్లో పూర్తి చేయిస్తామని చెప్పిన అధికారులు.. ఇప్పటి వరకు సగం పనులు కూడా పూర్తి చేయలేక పోయారని, మట్టితీత పనులు పూర్తి అయినా.. సీసీ పనులు కొంత మేర చేసి ఆపేశారని బాధిత గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎంపీ చొరవతో రోడ్డు, మురుగు కాలువ పనులు చేపట్టారని.. వర్షకాలం వచ్చే లోపు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రైల్వే అండర్ పాసు బ్రిడ్జి వద్ద ప్రారంభమైన సీసీరోడ్డు పనులు